సంపుటి - 4 మార్చి-2021 సంచిక-4

# జీవస్వరం

ఆధ్యాత్మిక మాస పత్రిక


తండ్రి గారి సందేశం.............................................3

యేసు ప్రభుని మరణం-పాత నిబంధన ప్రవచనాలు........5

విశ్వాసం..........................................................9

బైబిల్ దర్శనం ..................................................11

బ్రదర్ జోసఫ్ తంబి గారు.....................................13

శుభవచనం బైబిల్ క్విజ్.......................................15

ఇంద్రధనుస్సు...................................................17

ఏంజెల్స్ కార్నర్.................................................18


సహవాసం........................................................19

బైబిల్ దృశ్యమాలిక.............................................21


శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు...........................23










**ముద్రణానుమతి**

**బిషప్ ప్రిన్స్ అంతోని గారు**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు**



**సంపాదక వర్గం**

ఫాదర్ సిజో
ఫాదర్ యోహాన్
ఫాదర్ మహేశ్
సిస్టర్ క్రిస్టీన CMC
సిస్టర్ హృదయ ASMI
Mr. J. లూర్థు స్వామి
Mr. M. సత్యం
Mrs. K. శ్రీలత

**టైపింగ్ సహకారం** – D. ప్రిన్సి



**జీవస్వరం**
**బిషప్స్ హౌస్**
**మంచిర్యాల- 504 208**
**మంచిర్యాల జిల్లా**
**తెలంగాణ**

**Cell: 09398764408**

**Email ID - jeevaswaramadilabad@gmail.com**

**Jeevaswaram**
**Bishop's House**
Mancherial - 504 208
Mancherial Dist
Telangana State

**"ప్రభూ! ప్రభూ! అని నన్ను సంబోధించు**

**ప్రతివాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడు!**

**కాని, పరలోకమందలి నా తండ్రి**

**చిత్తానుసారముగా వర్తించువాడే**

**పరలోక రాజ్యమున ప్రవేశించును".**

**(మత్తయి 7,21)**

### నోవెల్ కరోనా వైరస్ (కొవిడ్–19) నుండి విడుదల కొరకు ప్రార్థన

మహాకృపాసంపన్నుడైన పరమతండ్రి, మీరు ఈ లోకమంతటిపై, మానవులందరిపై మీ ప్రేమను కుమ్మరిస్తున్నారు. అందరిపై ప్రత్యేకముగా అనారోగ్యముతో బాధపడుతున్న వారిపై మీ అనుగ్రహములను కురిపిస్తున్నారు. ఓ ప్రభువా, కరోనా వైరస్ సోకిన వారిని మీకు సమర్పించి ప్రార్థిస్తున్నాము. "అతడు పొందిన దెబ్బల ద్వారా మనకు ఆరోగ్యము చేకూరెను" అన్న వాక్యమును ఆధారముగా చేసికొని మీ సన్నిధిలో మొరపెడుతున్నాము. మా కన్నీటి మొరను ఆలకించండి. కరోనా వైరస్ సోకిన వారిపై మీ దయగల హస్తమును చాపండి. వారిని స్వస్థపరచండి. ఈ వైరస్ సోకిన వారిని, దానికి బలైపోతున్న వారి కుటుంబాలను ఓదార్చండి. రోగులకు చికిత్సనందిస్తున్న వైద్యులను, వారికి సహాయం చేస్తున్న వారిని, ప్రభుత్వ యంత్రాంగమును దీవించండి. ఈ వైరస్‌కు మందును కనుగొనుటకు చేసే పరిశోధనలను, అన్ని ప్రయత్నాలను ఫలవంతం చేయండి. ప్రపంచమంతటిపై మీ స్వస్థత వరమును జడివానలా కురిపించండి. ఈ వైరస్ మాకు సోకకుండా ఉండుటకు మీ సంరక్షణను మాకు దయచేయండి. ఈ ప్రార్థనను పరమవైద్యుడైన యేసు క్రీస్తు నామమున వేడుకుంటున్నాము. ఆమెన్.

# తండ్రి గారి సందేశం....



## సిలువ - ప్రేమకు గుర్తు

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

యేసు ప్రభువు పాపులమైన మన కొరకు అనుభవించినటువంటి బాధలు, శ్రమలు మరియు ఆయన జీవత్యాగమును తపస్సు కాలములో మనము స్మరించుకుంటున్నాము. తపస్సు కాలపు 50 రోజులు క్రైస్తవ బిడ్డలమైన మన జీవితంలో ఆధ్యాత్మిక ఫలాలు ధారాళముగా పొందే పుణ్యదినాలు. మన రక్షణ కొరకు ఆయన తనను తాను అర్పించిన సిలువ బలి విలువ ఎంత గొప్పదో అని మనకు తెలుసు. అందుకే కదా తపస్సు కాలమును ప్రార్థన, పశ్చాత్తాపము మరియు దానధర్మాలతో నిండిన రోజులుగా మనము ఆచరిస్తున్నాము. ఈ తపస్సు కాలములో మనము అర్థము చేసుకోవలసిన రెండు ముఖ్యమైన అంశాలు మీకు తెలియజేయాలని నేను ఆశిస్తున్నాను.

**1. సిలువ – ప్రేమకు గుర్తు**

తపస్సు కాలము దేవుని సిలువ మరణమును ధ్యానిస్తూ ప్రార్థిస్తున్నటువంటి రోజులు. ఆయన చేసినటువంటి సిలువ బలి ద్వారా, సిలువ ప్రేమకు గుర్తుగా ఎల్లప్పుడు నిలిపోయింది. అందుకే పౌలుగారు కొరింతీయులకు వ్రాసిన మొదటి లేఖలో ప్రేమ సహనము కలది (1 కొరింతీ 13,4) అని వ్రాసాడు. యేసు ప్రభువు తన సిలువ బలి ద్వారా నిజమైన ప్రేమ ఏమిటో లోకానికి చూపించారు. ఎందుకంటే, "తన స్నేహితుల కొరకు తన ప్రాణమును ధారపోయు వాని కంటే ఎక్కువ ప్రేమ కలవాడు ఎవడును లేడు" (యోహాను 15,13). త్యాగం లేకుండా ప్రేమ ఉండదు అని సిలువ మనకు గుర్తు చేస్తుంది. దేవుని అపరిమిత ప్రేమ గురించి మనము సువార్తలో చదువుతున్నాము. "దేవుడు ఈ లోకమును ఎంతో ప్రేమించి, తన ఏకైక కుమారుని ప్రసాదించెను" (యోహాను 3,16). తన పోలికలో సృజించినటువంటి మానవున్ని (ఆది 1,27) పాపపు బానిసత్వము నుండి రక్షించి నిత్యజీవమును ప్రసాదించడానికి యావే ఇట్లు చేసెను. తన ఏకైక కుమారుని రక్తముచే కడుగబడిననే తప్ప, పాపములో మునిగియున్న మనుష్యులను రక్షించడం సాధ్యం కాదు అని యావే దేవుడు ఎరిగియున్నారు. అందుకే తన ఏకైక కుమారుని ఈ లోకమునకు పంపారు.

యేసు ప్రభువు సిలువలో మరణించాలన్నదియే దేవుని ప్రణాళిక. ఎందుకంటే రక్తము దారపోయక పాపక్షమాపణ అనేది ఉండదు (హెబ్రీ 9,22). "మనము పాపాత్ములమై ఉన్నప్పుడే క్రీస్తు మన కొరకై మరణించి, దేవుడు మనపై తనకు ఉన్న ప్రేమను చూపించినాడు" (రోమీ 5,8) అని మనము పవిత్ర గ్రంథములో చదువుతున్నాము. మన కొరకు దేవుడు తన ఏకైక కుమారుని ఈ లోకానికి పంపడం, ఆ కుమారుని జీవత్యాగము ద్వారా మనము శుద్ధిచేయబడుట, మన యోగ్యతవలనో, గొప్పతనమువలనో కాదు. మనము పాపముచే దూరమైనను దేవునికి మనపైగల అవధుల్లేని ప్రేమ వలన మాత్రమే. అందుకే సిలువ ప్రేమకు

గుర్తుగా మారిపోయింది. ఇంతకంటే ఎక్కువగా దేవుడు మనలను ప్రేమించలేదు. ఆయన తనకున్నదంతయు ఒసగి ఈ లోకాన్ని ప్రేమించారు. ఈ తపస్సు కాలములో ప్రేమకు గుర్తుగానున్న సిలువను పట్టుకొని సిలువ జీవితము జీవింపగలగాలి. సిలువ జీవితము అంటే ప్రేమతో నిండియున్న జీవితము. ఈ ప్రేమయే మనలను ముందుకు నడిపిస్తుంది. ప్రేమకు గుర్తుగానున్న సిలువ మనకు ఇలా బోధిస్తున్నది. ఈ తపస్సు కాలములో ప్రత్యేకముగా "నేను మిమ్ము ప్రేమించినట్లే, మీరును ఒకరిని ఒకరు ప్రేమింపుడు" (యోహాను 13,34). అనే ప్రభు వాక్కులను స్మరించుకుందాం. ఈ నిస్వార్థమైనటువంటి ప్రేమయేం మనలను ఉపవాసములో, ప్రార్థనలో మరియు ధానదర్మాలలో జీవించడానికి ప్రేరేపిస్తుంది.

**2. తపస్సు కాలములో సరియైన ఉపవాసం**

తపస్సు కాలము ఉపవాసముతో జీవించే రోజులు అని మనకందరికి తెలుసు కాని సరియైన ఉపవాసం ఏ విధముగా ఆచరించాలి అని యోషయా గ్రంథం 58,1-10లో మనము చదువుతున్నాము. యెషయా ప్రవక్త ద్వారా మనము ఎలా ఉపవాసం ఆచరిస్తున్నామనియు (యెషయా 58,1-5) మరియు దేవుడు ఇష్టపడు ఉపవాసం ఏమిటనియు (యెషయా 58,6-10) ఈ వాక్యాలలో చాలా స్పష్టంగా దేవుడు మనతో మాట్లాడుతున్నాడు.

ఆకలిగొనిన వారికి భోజనము పెట్టాలి (58,10) బాధితులను ఆదుకోవాలి, అన్యాయపు బంధములను విప్పి, పీడితులను ఎట్టి బాధలకు గురికాకుండా విడిపించాలి (58,6) అని దేవుడు గుర్తు చేస్తున్నాడు. భోజనము లేని వారికి ఆహారము, ఇల్లు లేని వారికి ఆశ్రయము, బట్టలు లేని వారికి దుస్తులను ఇవ్వడము మరియు మన బంధువులకు సహాయం నిరాకరింపకుండా ఉండుటయే (58,7) సరియైన ఉపవాసం. అప్పుడు మనము చేసే ఉపవాసానికి తీసుకునే దీక్షలకు ఒక సరియైన అర్థం ఉంటుంది.

కాబట్టి ప్రియులారా ఈ తపస్సుకాలములో మనం మన పొరుగువారికి, బంధుమిత్రులకు నిస్వార్థమైన సేవాభావముతో సహాయము చేయాలి. ఒకవేళ మనము పేదవాళ్ళమని అనుకొని ఎట్లా ఇతరులకు సహాయము చేయగలమని అనుకోవచ్చు. కాని, అన్యారోగ్యంతో బాధపడుతున్న వారిని సంధర్శించడము, ఇతరులను చిరునవ్వుతో పలకరించడము మరియు ఇతరుల కోసం ప్రార్థన చేయడం కూడా పుణ్య కార్యమే అని మనము తెలుసుకోవాలి. కావున ఈ తపస్సుకాలములో దేవుని వచనం మీద ఆధారపడి, దేవుని వాక్యాన్ని చదువుతూ, ధ్యానిస్తూ మరియు పాటించి, జీవించడానికి ప్రయత్నము చేద్దాం. ఎందుకంటే "దేవుని వాక్కు నిష్ఫలముగా ఉండదు'' (యెషయా 55,11). భూమ్యాకాశములు గతించిపోయినా ఎన్నటికిని గతించిపోని (లూకా 21,33) దేవుని వచనంలో విశ్వసించి, దేవుడు ఇష్టపడుతున్న ఉపవాసములతో ఈ తపస్సు కాలము గడపడానికి ప్రయత్నము చేద్దాం.

దేవుడు మనలందరిని దీవించును గాక!

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు



# యేసు ప్రభుని మరణం – పాత నిబంధన ప్రవచనాలు

యేసు ప్రభుని మరణం గురించి పాత నిబంధనలో ఎన్నో ప్రవచనాలు ఉన్నాయి. యేసు ప్రభుని మరణ సమయంలో ఆ ప్రవచనాలు నెరవేరినట్లు సువార్తలు సాక్ష్యమిస్తున్నాయి. యెషయా గ్రంథం 53వ అధ్యాయం మరియు 22వ కీర్తన యేసు ప్రభుని శ్రమలు మరియు మరణాన్ని గూర్చి చాలా సవివరంగా తెలుపుతున్నాయి. ఆ ప్రవచనాలను మనం తెలుసుకుందాం. ముందుగా క్రొత్త నిబంధనలోని వాక్యం దానికి సమానమైన పాత నిబంధనలోని ప్రవచనం వ్రాయబడింది.

**1. యేసు ప్రభును చంపటానికి కుట్ర**

అప్పుడు ప్రధానార్చకులు, ప్రజల పెద్దలు, కైఫా ప్రధానార్చకుని సభామందిరమున సమావేశమై, దొంగచాటుగ యేసును బంధించి, చంపవలెనని సమాలోచన చేసిరి. (మత్తయి 26,3-4)

నీతిమంతుడైన నరుని పీడను వదిలించుకొందము. ఉచ్చులు పన్ని అతనిని కూల ద్రోయుదము, అతనికి మన కార్యములు గిట్టుట లేదు. మనము ధర్మ శాస్త్రమును పూర్వాచారములను పాటించుట లేదని అతడు మనలను నిందించుచున్నాడు. (సోలోమోను 2,12)

ప్రభువునకు, ఆయన అభిషిక్తునకు విరుద్ధముగ భూలోకములోని రాజులు లేచిరి, అధికారులు ఒక్కుమ్మడిగ కూడిరి. నీవు అభిషేకించిన నీ పావన సేవకుడైన యేసునకు విరోధముగ 'అన్య మతస్థులతోను', యిస్రాయేలు ప్రజలతోను హేరోదు, పొంతి పిలాతులు నిజముగ ఈ నగరమందు ఏకమైరి. (అ.కా. 4, 26-27)

ప్రభువును, అతడు అభిషేకించిన రాజును ఎదిరించుటకుగాను ఈ లోకపు రాజులు సంసిద్ధుల గుచున్నారు. పాలకులందరు కలిసి దురాలోచనలు చేయుచున్నారు. (కీర్తన 2,2)

**2. యేసు ప్రభుని అప్పగించినందుకు వెండి నాణెముల బహుమానం**

వారితో, "నేను ఆయనను మీకు అప్పగించిన యెడల మీరు నాకు ఏమి ఇచ్చెదరు?" అని అడిగెను. వారు అతనికి ముప్పది వెండి నాణెములను ఇచ్చిరి. (మత్తయి 26,15)

వారు ముప్పది వెండి నాణెములను నాకు జీతముగా చెల్లించిరి. ప్రభువు నాతో 'ఆ సొమ్మును దేవాలయ కోశాగారమున ఉంచుము' అని చెప్పెను. కనుక, నేను ఆ ముప్పది వెండి నాణెములను దేవాలయ కోశాగారమున ఉంచితిని. నా విలువ ఆ ఘనమైన సొమ్మునకు సరిపోవునని వారి తలంపు! (జెకర్యా 11,12-13)

**3. యేసు ప్రభుని ప్రాణ స్నేహితుడే అతనిని శత్రువులకు అప్పగించాడు.**

అందుకు ఆయన "నాతో ఈ పాత్రలో చేతిని ముంచిన వాడు నన్ను అప్పగించును. (మత్తయి 26,23)

నేను బాగుగా నమ్మిన ప్రాణ స్నేహితుడే, నా యింట భోజనము చేసినవాడే నా మీద తిరుగబడెను. (కీర్తన 41,9)

**4. యేసు ప్రభుని ఆవేదన**

"నా ఆత్మ మరణ వేదనను అనుభవించుచున్నది. మీరిచటనే యుండి, నాతో జాగరణ చేయుడు" అని పలికెను. (మత్తయి 26,38)

ప్రభూ! నేను మానసిక విచారమున మునిగియుండి, నిన్ను జ్ఞప్తికి తెచ్చుకొనుచున్నాను. (కీర్తన 42,6)

**5. నూతన నిబంధన యొక్క రక్తము**

ఇది అనేకుల పాపపరిహారార్థమై చిందబడనున్న నిబంధన గల నా రక్తము (మత్తయి 26,28)

ప్రభువు ఇట్లనుచున్నాడు. నేను మీతో పశు రక్తముతో గూడిన నిబంధనము చేసికొంటినిగాన, నీళ్ళు లేని గుంట వంటిదగు, ప్రవాసపు చెర నుండి, మీ ప్రజలకు విముక్తి దయచేయుదును. (జెకర్యా 9,11)

**6. యేసు ప్రభు బంధింపబడిన తరువాత శిష్యులందరు పారిపోయారు.**

అపుడు యేసు వారితో, "మీరు ఈ రాత్రి నన్ను వదలి పెట్టి పోయెదరు. 'నేను గొఱ్ఱెల కాపరిని కొట్టుదును. మందలోని గొఱ్ఱెలు చెల్లాచెదరగును.' అని వ్రాయబడి యున్నది. (మత్తయి. 26,31)

సర్వశక్తిమంతుడైన యావే ప్రభువు ఇట్లనుచున్నాడు. "ఖడ్గమా" మేల్కొనుము. నా గొఱ్ఱెల కాపరి మీద, నా సహకారి మీద పడుము. అతనిని వధింపుము, మంద చెల్లాచెదరగును. నేను నా ప్రజలపై పడుదును. (జెకర్యా 13,7)

**7. యేసు ప్రభు తన మరణాన్ని తండ్రి చిత్తముగా అంగీకరించారు.**

ఆయన మరి కొంతదూరము వెళ్ళి నేలపై సాగిలపడి "ఓ తండ్రి! సాధ్యమైన యెడల ఈ పాత్రను నా నుండి తొలగిపోనిమ్ము, అయిన నా ఇష్టము కాదు. నీ చిత్తమే నెరవేరనిమ్ము" అని ప్రార్థించెను. (మత్తయి 26,39)

నీవు బలి సమర్పణములను కోరలేదు. దహనబలిని పాప పరిహార బలిని అభిలషింపలేదు. కానీ నీ మాటల నాలకించుటకు నాకు చెవులొసగితివి. అపుడు నేను ఇట్లు పలికితిని. "ఇదిగో నేను వచ్చుచున్నాను. లేఖనములో నా గురించి వ్రాయబడినట్టుగా, ఓ దేవా! నీ చిత్తమును నెరవేర్చుటయే నాకు పరమానందము. నీ ధర్మశాస్త్రము నా యెదలో పదిలముగా నిల్చియున్నది." (కీర్తన 40,6-8)

**8. యేసు ప్రభువుకు వ్యతిరేకంగా అబద్ధ సాక్ష్యములు**

యేసును చంపుటకై అచటి ప్రధానార్చకులు, న్యాయసభ అసత్య సాక్ష్యము వెదకిరి. (మత్తయి 26,59)

నన్ను విరోధుల చేతికి చిక్కనీయకుము. వారు నా మీద కూట సాక్ష్యములు చెప్పుచున్నారు. దౌర్జన్యముతో బుసలు కొట్టుచు, నన్ను బెదరించుచున్నారు. (కీర్తన 27,12)

**9. యేసు ప్రభు విచారణ సమయంలో, సిలువ మరణం సమయంలో మిన్నకుండెను.**

అందుకు యేసు మిన్నకుండెను. ప్రధానార్చకుడు మరల "జీవముగల దేవునితో ఆనబెట్టి అడుగుచున్నాను. నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువా? మాతో చెప్పుము. అని యేసును ప్రశ్నించెను. (మత్తయి 26,63)

దౌర్జన్యమునకు గురియైనను, అతడు వినయముతో సహించెను. పల్లెత్తు మాట అనడయ్యెను. అతడు వధ్య స్థానమునకు గొనిపోబడు గొఱ్ఱె పిల్లవలె, ఉన్ని కత్తిరింపబడు గొఱ్ఱెవలె మౌనముగా నుండనే కాని, నోరు తెరవలేదు. (యెషయా 53,7)

**10. యేసు ప్రభు అవమానమునకు గురి యగుట**

ముండ్ల కిరీటము అల్లి ఆయన శిరముపై పెట్టిరి. కుడి చేతిలో రెల్లుకాడనుంచిరి. ఆయన ముందు మోకరిల్లి "యూదుల రాజా! నీకు జయము!" అని అవహేళన చేసిరి. (మత్తయి 27,29).

ప్రజలు అతనిని చిన్నచూపు చూచి తృణీకరించిరి. అతడు విచారగ్రస్తుడును, బాధామయుడైనవాడు. నరులు అతని వైపు చూచుటకైన ఇష్టపడలేదు. జనులతనిని తిరస్కరించుటచే మనము అతనిని లెక్కచేయలేదు. (యెషయా 53,3)

**11. యేసు ప్రభువు అపరాధులలో ఒకడుగా ఎంచబడ్డాడు.**

ఆయనతో పాటు కుడి ఎడమల ఇద్దరు దొంగలు సిలువ వేయబడిరి. (మత్తయి 27,38)

అతడు తన ప్రాణములను అర్పించెను. దుష్టుడుగా ఎంచబడెను. పెక్కుమంది దోషములను భరించి, వారి పాపముల పరిహారము కొరకు విజ్ఞాపనము చేసెను. కనుక, నేను అతనిని గొప్ప వానిని చేయుదును. అతడు ఘనులలో నొకడుగా గణింపబడును. (యెషయా 53,12)

**12. యేసు ప్రభుని కాళ్ళకు, చేతులకు మేకులను కొట్టుట**

వారు ఆయనను సిలువ వేసిరి. (మత్తయి 27-36)

శునకములు నన్ను చుట్టిముట్టినవి. దుష్ట బృందము నా చుట్టు క్రమ్ముకొనినది. వారు నా కాలు చేతులను చీల్చు చున్నారు. (కీర్తన 22-16)

**13. యేసు ప్రభుని అనుచరులు ఆయన మరణమును దూరము నుండి చూశారు.**

యేసుకు పరిచర్య గావించుటకై గలిలీయ నుండి ఆయనను వెంబడించిన స్త్రీలు అనేకులు దూరము నుండి చూచుచుండిరి. (మత్తయి 27-55)

నా స్నేహితులు, ఇరుగు పొరుగు వారు నా గాయములను చూచి నా చెంతకు వచ్చుటలేదు. నా బంధువులు కూడ దూరముగా నిలుచుచున్నారు. (కీర్తన 38-11)

**14. యేసు ప్రభుని అంగీకొరకు చీట్లు వేసుకొనుట.**

వారు ఆయనను సిలువ వేసిరి. చీట్లు వేసికొని ఆయన వస్త్రములను పంచుకొనిరి. (మత్తయి 27-35)

యేసును సిలువ వేసిన పిమ్మట, సైనికులు ఆయన వస్త్రములను నాలుగు భాగములు చేసి తలొక భాగము తీసికొనిరి. వారు అంగీని సహితము తీసికొనిరి అది కుట్టు లేకుండా నేయబడి యున్నందున, "దీనిని చింపవద్దు. ఇది ఎవరికి వచ్చునో అదృష్టపు చీట్లు వేసికొందము". అని వారు ఒకరితోనొకరు చెప్పుకొనిరి. వారు నా వస్త్రములు తమలో పంచుకొనిరి. నా అంగీకొరకు అదృష్టపు చీట్లు వేసుకొనిరి. అను లేఖనము నెరవేరునట్లు ఇది జరిగెను. (యోహాను 19-23:27)

వారు నా బట్టలను తమలో తాము పంచుకొనుచున్నారు. నా దుస్తుల కొరకు చీట్లు వేసికొనుచున్నారు. (కీర్తన 22-18)

**15. యేసు ప్రభుకు వారు చేదు రసమును అందించారు.**

వెంటనే ఒకడు పరుగెత్తి, నీటి పాచి తీసుకొని, పులిసిన ద్రాక్షా రసములో ముంచి, ఒక కొలకు తగిలించి, ఆయనకు త్రాగనిచ్చెను. (మత్తయి 27-48)

వారు నాకు భోజనమునకు మారుగా విషమును ఒసగిరి. నేను దుప్పికగొని యున్నప్పుడు ద్రాక్షారసము ఇచ్చిరి. (కీర్తన 69-21)

**16. అనేకులు ఆయనను గేలిచేశారు.**

వచ్చి పోవువారు తలలూపుచు, ఆయనను దూషించుచు, "దేవాలయమును పడగొట్టి మూడు రోజులలో మరల నిర్మించువాడా! నిన్ను నీవు రక్షించుకొనుము. దేవుని కుమారుడవైనచో సిలువ నుండి దిగి రమ్ము" అని పలికిరి. అలాగే ప్రధానార్చకులు ధర్మశాస్త్ర బోధకులతో, పెద్దలతో కలిసి, "ఇతను ఇతరులను రక్షించెనుగాని, తనను తాను రక్షించుకొనలేడాయెను. ఇతడు యిస్రాయేలీయుల రాజు గదా! ఇపుడు సిలువ నుండి దిగి రానిమ్ము అపుడు మేము విశ్వసింతుము" అని హేళన చేసిరి." ఇతడు దేవుని నమ్మెను. 'నేను దేవుని కుమారుడను' అని చెప్పెను. కనుక దేవునికిష్టమైన, ఇతనినిప్పుడు రక్షింపనిమ్ము" అనిరి. అదే విధముగ ఆయనతో పాటు సిలువపై కొట్టబడిన దొంగలు కూడ ఆయనను అట్లే దూషించిరి. (మత్తయి 27-39:44)

నా వైపు చూచిన వారెల్ల నన్ను గేలి చేయుచున్నారు. నాలుక వెళ్ళబెట్టి తల ఊపుచున్నారు. (కీర్తన 22-7).

**17. యేసు ప్రభు పలికిన మాట**

ఇంచు మించు మూడు గంటలు సమయమున "ఏలీ, ఏలీ, లామా సబక్తాని" అని యేసు బిగ్గరగా కేక పెట్టెను. "నా దేవా! నాదేవా! నీవు నన్నేల విడనాడితివి? అని దీని అర్థము. (మత్తయి 27-46)

నా దేవా! నాదేవా! నన్నేల చేయి విడిచితివి? నేను నీకు మొరపెట్టితిని గాని నీవు నన్నింకను ఆదుకోవైతివి. (కీర్తన 22-1).

**18. యేసు ప్రభు మరణ సమయంలో లోకము అంధకారమగుట**

అపుడు పగలు పండ్రెండు గంటల నుండి మూడు గంటల వరకు ఆ దేశమంతట చీకటి క్రమ్మెను. (మత్తయి 27, 45)

సర్వోన్నతుడైన ప్రభువు ఇట్లనుచున్నాడు. "ఆ దినము మిట్ట మధ్యాహ్నమే ప్రొద్దు క్రుంకగా, పట్టపగలే నేలపై చీకట్లలముకొనునట్లు చేయుదును. (ఆమోసు 8,9)

**19. యేసు ప్రభుని చివరి ప్రార్థన.**

యేసు బిగ్గరగా, "తండ్రీ! నా ఆత్మను నీ చేతికి అప్పగించుచున్నాను." అని పలికి ప్రాణము విడిచెను. (లూకా 23-46)

నన్ను నేను నీ చేతులలోనికి అర్పించుకొను చున్నాను. ప్రభూ! నీవు నన్ను కాపాడితివి, నీవు నమ్మదగిన దేవుడవు. (కీర్తన 31-5)

**20. యేసు ప్రభుని ఎముకలలో ఒక్కటి కూడా విరగ గొట్టబడలేదు.**

"ఆయన ఎముకలలో ఒకటైన విరగ గొట్టబడదు" అను లేఖనము ఇట్లు నెరవేరెను. (యోహాను 19-36)

మీరందరు ఒక్కయింటి నీడనే మాంసము తినవలెను. ఒక్క మాంసపు ముక్కయిన యింటి నుండి బయటికి తీసుకొని పోరాదు ఒక్క యెముకనైన విరగగొట్టరాదు. (నిర్గమ 12-46)

**21. యేసు ప్రభుని ప్రక్కలో పొడుచుట**

అయితే, సైనికులలో ఒకడు ఆయన ప్రక్కను బల్లెముతో పొడిచెను. వెంటనే రక్తము, నీవు స్రవించెను. "వారు తాము పొడిచిన వాని వైపు చూతురు" అను లేఖనము ఇట్లు నెరవేరెను. (యోహాను 19, 34 & 37)

వారు తాము కత్తితో పొడిచిన వానివైపు చూతురు. (జెకర్యా 12,10)

**22. యేసు ప్రభుని మరణమును చూచి వారు ఏడ్చుట**

అచట గుమిగూడిన ప్రజలందరు ఈ సంఘటనలను చూచి రొమ్ము బాదుకొనుచు తిరిగి ఇంటికి వెళ్ళిరి. (లూకా 23,48)

నేను దావీదు వంశజులపైన, యోరూషలేములోని యితర ప్రజలపైన దయా గుణమును, ప్రార్థనా గుణమును కుమ్మరింతును. వారు తాము కత్తితో పొడిచిన వాని వైపు చూతురు. ఏకైక కుమారుని కోల్పోయిన వారి వలె అతని కొరకు విలపింతురు. తొలిచూలు కుమారుని కోల్పోయిన వారి వలె అతని కొరకు శోకింతురు (జెకర్యా 12,10)

**23. యేసు ప్రభుని సమాధి గురించి**

మొదట యేసును రాత్రివేళ సందర్శించిన నికోదేము కూడ ఇంచు మించు నూట ఏబది సేర్ల బరువు గల పరిమళ ద్రవ్యమును, అత్తరును తీసికొని వచ్చెను. వారు యేసు దేహమును తీసికొని, యూదుల భూస్థాపన సంప్రదాయానుసారము దానికి పరిమళ ద్రవ్యమును పూసి నార వస్త్రముతో చుట్టిరి. యేసు సిలువ వేయబడిన చోట ఒక తోట గలదు. ఆ తోటలో ఇంతవరకెవరిని, భూస్థాపితము చేయని ఒక క్రొత్త సమాధి ఉండెను. అది విశ్రాంతి దినమునకు యూదులు సిద్ధపడు దినమగుట చేత, ఆ సమాధి సమీపమున ఉండుట చేత వారు యేసును అందుంచిరి. (యోహాను 19,39-42)

ఏ తప్పు చేయకున్నను, ఎన్నడు అబద్ధ మాడకున్నను, అతనిని దుష్టుల ప్రక్కన పాతిపెట్టిరి, ధనవంతుని ప్రక్కన సమాధి చేసిరి. (యెషయా 53,9)



# విశ్వాసం

క్రైస్తవంలో విశ్వాసం చాలా ప్రాముఖ్యమైనది. క్రైస్తవ జీవనానికి విశ్వాసమే పునాది. వాక్యం చెబుతుంది హెబ్రీ పత్రికలో 11వ. అధ్యాయం 6వ. వచనంలో విశ్వాసం లేకుండా ఎవరు కూడా దేవున్ని సంతోష పెట్టలేరు. అంటే విశ్వాసం లేకుండా దేవుని దగ్గరకు ఎవరుకూడ రాలేరు. అటువంటి వారిని దేవుడు మెచ్చడు. అటువంటి వారిని దేవుడు లక్ష్యపెట్టడు. దేవున్ని తెలుసుకోవాలన్న, దేవునితో సంబంధం ఏర్పరుచుకోవాలన్న విశ్వాసం అనేది ఒక కనీస అర్హత. భారతదేశంలో ముక్కోటి విశ్వాసాలు ఉన్నప్పటికి క్రైస్తవ విశ్వాసం ప్రత్యేకమైనది. ఎందుకంటే ఈ ముక్కోటి విశ్వాసాల మధ్య మన విశ్వాసానికి ఒక ప్రత్యేకత, ఔన్నత్యం ఉంది. ఎందుకంటే ఇతర విశ్వాసాలకు గొప్పతనం, విశిష్టత విశ్వాసిలో ఉంటుంది. నా విశ్వాసానికి మన విశ్వాసానికి గొప్పతనం విశ్వాసిలో ఉండదు. ఎవరి మీద మనం విశ్వాసముంచుతున్నామో ఆయన మీద ఉంటుంది. పేతురు వ్రాసిన రెండు పత్రికలలో కూడ మన విశ్వాసం అమూల్యమైనది అని వ్రాసాడు. అమూల్యము అంటే వెలకట్టలేనిది. అంటే మనం ఎంత వెల చెల్లించినా దానికి సరిపోదు. విశ్వాసం అంటే ఒక స్థిరమైన కమిట్‌మెంట్. మంచి చేయడానికి, ఒక నీతిమంతుడైన ప్రభువుకు మనల్ని మనం సమర్పించుకోవడం. విశ్వాసంలో చాలా దశలున్నాయి. ఒకటి మానసికమైన విశ్వాసం. అంటే మానసికంగా, తిరిగి లేచాడని నమ్ముతాము. మానసికంగా యేసు మన పాపాల కోసం సిలువలో చనిపోయాడని నమ్ముతాము. చాలా భక్తి భావంతో ఈస్టర్ పండుగ కూడా చేసుకుంటాము. రెండవది భావోద్రేకమైన విశ్వాసం. మంచి ప్రసంగం విన్నప్పుడు, భక్తి పారవశ్యమైన పాటలు విన్నప్పుడు మనలో విశ్వాసం ఎగిసి పడుతుంది. చర్చి నుండి బయటికి రాగానే ఆ భావోద్రేక విశ్వాసం ఆవిరైపోతుంది.

మన మానసిక విశ్వాసం అలాగే భావోద్రేకమైన విశ్వాసం అక్కడే ఆగిపోతే మన విశ్వాసాన్ని దేవుడు లక్ష్యపెట్టడు. ఏ విశ్వాసాన్ని దేవుడు లక్ష్యపెట్టడు. ఏ విశ్వాసాన్ని దేవుడు లక్ష్యపెడతాడంటే నీ సంకల్పాన్ని, నీ చిత్తాన్ని ఆయనకు లోబర్చాలి. మన విశ్వాసం యేసు ప్రభుకు అంగీకార యోగ్యమేనా? ఒకసారి ఆత్మ విమర్శ చేసుకుందాం! యేసు ప్రభువే స్వయంగా చెప్పారు. "ప్రభూ!, ప్రభూ" అని నన్ను పిలుచువాడిని నేను అంగీకరించను. నా తండ్రి చిత్తాన్ని జరిగించువాడే నిజమైన శిష్యుడు అని. తండ్రి చిత్తం నేరవేర్చడం అంటే ఏమిటి? మన చిత్తాన్ని దేవుని చిత్తానికి లోబర్చాలి. అప్పుడే పరలోక రాజ్యానికి వెళ్ళగలం. విశ్వాసం లంగరు లాంటిది. సముద్రంలో పడవలను నిలపడానికి లంగరు వేస్తారు. పడవ కదలదు. భూమి సరిగా లేకున్నా లంగరు సరిగా పడకున్నా లంగరు వచ్చేస్తుంది. పడవ కొట్టుకొని పోతుంది. మన విశ్వాసం గట్టిగా లేకుంటే మన పరిస్థితి అంతే. సంపూర్ణంగా ఆయన మీద ఆధార పడాలి. మన విశ్వాసం యొక్క లంగరు ఎక్కడ వేశాము? అద్భుతాల మీదనా, ఆయిల్ బాటిల్ల మీదనా, లోక సంబంధ విషయాల మీదనా ఒక సారి పరీక్షించుకుందాం! విశ్వాసం అంటే మీ కోరికలను దేవుని కోసం వదులుకోవడం. మన సమస్తాన్ని ఆయనకు ధారాదత్తం చేయడం. విశ్వాసానికి తండ్రి అయిన అబ్రహామును చూడండి. దేవుని పట్ల ఆయన విశ్వాసం మూడు జాతుల వారికి తండ్రిని చేసింది. ఇలాంటి విశ్వాసంలోకి మనం ఎదగాలి. ఇలాంటి విశ్వాసమే మనల్ని పరలోక రాజ్యానికి చేరుస్తుంది. ఇలాంటి విశ్వాసమే మనకు రక్షణ భాగ్యాన్ని కలుగజేస్తుంది. ఈ శ్రమకాలంలో దేవునిపై సంపూర్ణంగా ఆధారపడడానికి ప్రయత్నిద్దాం. అందుకు కావలసిన కృపకై ఆయనను వేడుకుందాం!

లూర్థుస్వామి
బెల్లంపల్లి


## జీవస్వరం మాసపత్రిక తపస్సు కాలంలో యిర్మీయా గ్రంథం వ్రాసే పోటి

తపస్సు కాలంలో పరిశుద్ధ గ్రంథంలో ఎక్కువ సాన్నిత్యాన్ని పెంచుకొని, ధ్యానించడానికి వీలుగా జీవస్వరం మాసపత్రిక మీ అందరికి ఒక సదవకాశాన్ని అందిస్తుంది. ఫిబ్రవరి 15వ తేదీ నుండి ఏప్రిల్ 03వ తేదీ వరకు ఉన్న తపస్సు కాలంలో యిర్మీయా గ్రంథంను వ్రాయాలి. వ్రాసిన ప్రతిని ఏప్రిల్ 15వ తేదీలోపు "బిషప్స్ హౌస్, మంచిర్యాల"కు పంపించాలి. యిర్మీయా గ్రంథాన్ని వ్రాసిన తరువాత దానిని మంచిగా తయారుచేసి, మీ వివరాలను వ్రాసి మాకు పంపించండి. మీరు వ్రాసిన గ్రంథాన్ని పరిశీలించిన తరువాత సరిగ్గా ఉన్న గ్రంథాలను వ్రాసిన వారి పేర్లనుండి లాటరీ తీసి విజేతలను ప్రకటించడం జరుగుతుంది. వ్రాత (Hand writing) గానీ, అలంకారం (Beauty) గానీ విజేతను నిర్ణయించడానికి కారణాలు కావు. ఏ భాషలోనైనా వ్రాయవచ్చు

**మొదటి బహుమతి - రూ.॥ 3000**

**రెండవ బహుమతి - రూ.॥ 2000**

**మూడవ బహుమతి- రూ.॥ 1000**



## క్రీస్తు జననం (మత్తయి 1-2 అధ్యాయాలు)

### యేసే మెస్సీయా

మత్తయి సువిశేషంలో మొదటి రెండు అధ్యాయాలు ఈ పుస్తకానికి నాందిలాంటివి. ఈ గ్రంథంలో వచ్చే ప్రధానాంశాలు ఈ రెండు అధ్యాయాల్లో ఇమిడే ఉన్నాయి. క్రీస్తు యూద జాతిలో పుట్టాడు. అతడు అబ్రహాము సంతతికీ, దావీదు రాజవంశానికి చెందినవాడు.

వంశవృక్షాలు రాయడం పూర్వవేద రచయితలకు అలవాటు. ఈ పద్ధతిలోనే మత్తయి కూడ క్రీస్తు వంశావళిని వ్రాసి దాన్ని మూడు భాగాలుగా విభజించాడు. మూడు ఇతనికి నచ్చిన సంఖ్య. ఒక్కో భాగం 14 తరాలు ఉన్నాయి. యోసేపు ద్వారా క్రీస్తు దావీదు రాజవంశానికి చెందినవాడయ్యాడు. తరతరాలుగా యూదులు ఎదురుచూచిన మెస్సీయా యేసేనని మత్తయి ఈ వంశావళి ద్వారా సూచించాడు.

### కష్టాలు అనుభవించేవాడు, తన జనంతో ఉండేవాడు

బాలయేసు, తిరుకుటుంబం హేరోదు నియంత కష్టాలకు గురయ్యారు. ఈజిప్తుకు వలసపోయారు. ఈ వలస పూర్వవేదపు యూదుల ఈజిప్టు ప్రవాసాన్ని జ్ఞప్తికి తెస్తుంది. నిర్దోషులైన పసిబిడ్డలు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనలన్నీ క్రీస్తు భావి శ్రమలను సూచిస్తాయి. యావే ప్రభువు పూర్వవేద ప్రజలతో లాగే క్రీస్తు నూత్నవేద ప్రజలతో ఉండి వాళ్ళ కష్టసుఖాల్లో పాలుపంచుకొంటాడు. కనుక అతనికి ఇమ్మానువేలు అని పేరు. 1,22. ఈ సువిశేషం చివరన క్రీస్తు నేను లోకాంతం వరకు మీతో ఉంటాను అని అభయమిచ్చాడు. ఇప్పుడు కూడా అతడు తిరుసభలో ఉండి దాన్ని కాపాడుతుంటాడు.

### యేసు అన్యజాతులకు రక్షకుడు

హేరోదు, యెరూషలేము ప్రముఖులు యేసుని నిరాకరించి వధింపజూచారు. కాని అన్యజాతివారయిన జ్ఞానులు అతన్ని వెతుకుంటూ వచ్చారు. అతని రక్షణం

యూదుల ద్వారానే అన్యజాతులకు కూడ లభిస్తుందని ఈ జ్ఞానుల కథ తెలియజేస్తుంది. క్రీస్తు ఉత్థానం తర్వాత శిష్యులు అన్యులకు కూడా ఈ రక్షణాన్ని అందిస్తారు. అసలు క్రీస్తు వంశావళిలోనే తామారు, రూతు, బత్షెబా మొదలైన అన్యజాతి స్త్రీలున్నారు. యేసు అనే పేరుకు అర్థం "రక్షకుడు" (1,21). కనుక క్రీస్తు యూదులకూ, అన్యులకూ రక్షకుడు. క్రీస్తు శిశువు ఈజిప్టు నుండి పాలస్తీనా దేశానికి తిరిగి వచ్చి నజరేతులో జీవించాడనీ, కనుక నజరేయుడు అని పిలవబడ్డాడు అని చెప్పి మత్తయి ఈ భాగాన్ని ముగించాడు (2,23). దేవునికి అంకితులైన యూద భక్తులు నాసీరు వ్రతాన్ని పాటించారు. క్రీస్తు కూడ తండ్రికి అంకితుడై జీవించాడు. నజరేయుడు, నాసీరు శబ్దాలు ఒకటేనని మత్తయి అభిప్రాయం.

## 2. క్రీస్తు సువార్త ప్రచారానికి సిద్ధం కావడం (మత్తయి 3-4 అధ్యాయాలు)


### రక్షణ కాలం, పశ్చాత్తాపం


రక్షణ కాలం యోహాను బోధతో ప్రారంభమైంది. ఇతడు ఏలీయాలాగ కఠోర జీవితం గడిపినవాడు. క్రీస్తుకి మార్గం సిద్ధం చేసినవాడు. యోహాను మెస్సీయా రాకడకు సిద్ధం కండు అని ప్రజలను హెచ్చరించాడు. దీనికి మార్గం పశ్చాత్తాపం. ప్రజలు తమ దుర్బుద్ధులను మార్చుకొని మంచి పనులు చేయాలి (3,8). శారీరకంగా అబ్రహాముకి సంతానమైనంత మాత్రాన్నే యూదులకు రక్షణం కలగదు. హృదయ పరివర్తనం అవసరం. యోహాను జ్ఞానస్నానం పాప పరిహారాన్ని దయచేయదు. అది శుద్ధిని సూచిస్తుంది. పాపపరిహారానికి క్రీస్తు మరణోత్థానాలు అవసరం.

తండ్రి యొక్క రక్షణ ప్రణాళిక ప్రకారం క్రీస్తు యోహాను నుండి జ్ఞానస్నానం పొందాడు. ఆ సమయంలో ఆత్మ క్రీస్తు మీదికి దిగివచ్చింది. ఇక ఈ ఆత్మే క్రీస్తుని నడిపిస్తుంది. తండ్రి కూడా క్రీస్తుకి సాక్ష్యం పలికాడు. ఇక్కడ ముగ్గురు దైవవ్యక్తులు ప్రత్యక్షమయ్యారు. ఈ సాక్ష్యం యోర్దాను దగ్గర గుమిగూడిన ప్రజల కొరకు. ఇప్పుడు మనం జ్ఞానస్నానం పొందేది ముగ్గురు దైవవ్యక్తుల పేరుమీదుగానే.

### క్రీస్తు శోధనలు

ఎడారిలో పిశాచం క్రీస్తుని మూడుసార్లు శోధించింది. పూర్వం యిస్రాయేలు ప్రజలు ఎడారిలో చాలా శోధనలకు గురయ్యారు, పడిపోయారు కూడా. వాళ్ళకు దేవుని కుమారుడు అని పేరు. క్రీస్తుకి కూడా అదే పేరు ఉంది. అయినా ఆ తొలి కుమారుడు పడిపోయినకాడ ఈ మలి కుమారుడు పడిపోలేదు. ఇతడు దేవునికి సంపూర్ణంగా విధేయుడు. కనుక పిశాచాన్ని ఓడించి శోధనను జయించాడు. ఇప్పుడు పిశాచం మనలను శోధించినపుడు అతని విజయం మన మీద సోకుతుంది. హేరోదు యోహానుని బంధించి చెరలో పెట్టించాడు. అయితే అతని బోధను గలిలీయలో క్రీస్తు కొనసాగించాడు. అతడు కఫర్నాములో నివాసం ఏర్పరుచుకొని ఆ ప్రాంతానికంతటికీ వెలుగయ్యాడు (4,16). ఈ సమయంలోనే పండ్రెండు మంది శిష్యులను కూడా ఎన్నుకొన్నాడు. వారిలో పేతురు, యోహానులు ముఖ్యులు. ఆ శిష్యుల సేవను ఇప్పుడు మనం కొనసాగిస్తున్నాం.





# బ్రదర్ జోసఫ్ తంబి గారు

**అస్సిసి ఫ్రాన్సీసువారి మూడవ సభ బ్రదరు**

**(క్రీ॥శ॥ 1880-1945)**

భక్త బ్రదర్ జోసఫ్ తంబి గారు భారతదేశంలోని తమిళనాడు రాష్ట్రంలో పాండిచెరి పట్టణంలో పుట్టు క్రైస్తవులును, ఉన్నతులైన 'తంబీ' కుటుంబంలో సుమారు క్రీ॥శ॥ 1880లో జన్మించారు. వారి చిన్నతనంలోనే తల్లిని కోల్పోగా తండ్రి రెండవ పెండ్లి చేసుకున్నాడు. సవతి తల్లితో పొసగని చిన్ని జోసఫ్ ఇల్లు విడిచి వెళ్లిపోయారు. ప్రక్కనున్న రాష్ట్రాలలో సంచరించి కొన్ని సంవత్సరాలు కేరళ రాష్ట్రంలో గడిపారు. ఇల్లు విడిచిన తర్వాత వారు అష్టకష్టాలు అనుభవించారు. వారు లాటిన్‌భాషలో ప్రార్థనలు చెప్పుకోవడాన్ని బట్టి చూస్తే ఏదొక సన్యాసి మఠంలోనో, దేవాలయ పరిచారకునిగానో చేరి ఉండవచ్చని భావింపబడింది.

కొన్నేండ్లు గడిచాక జోసఫ్ తంబి గారు తమ యవ్వనదశలో తిరిగి పాండిచెరికి చేరుకున్నారు. పెరిగిన గడ్డం, తొడిగిన గోధుమ రంగు అంగీ, నడుముకు త్రాడు అచ్చం సాధువు లేక స్వామిజీలా కనిపించారు. వారు పునీత ఫ్రాన్సీసు అస్సిసివారి మూడవ సభ సభ్యుడుగా చేరారు. ఆ సభగురువులు ధరించే రంగు దుస్తులు ధరించి క్రీస్తు సువార్తా ప్రచారం చేస్తూ క్రైస్తవ ఆదర్శాలతో, పేదరికంను అనుసరింప అనుమతి పొందారు. ఎవ్వరు అతనిని గుర్తుపట్టకుండా, ఏదో పరాయి సన్యాసిలా పాండిచెరి దేవాలయాలం వద్ద సంచరిస్తున్న జోసఫ్ తంబి గారిని నిలదీయడంతో వారు వాస్తవాల్ని ఒప్పుకున్నారు. ఆ తరువాత బంధువుల ఆహ్వానంపై స్వగృహంలోను బంధువుల ఇండ్లలోను కొన్నాళ్లు గడిపారు. ఎంతైనా తన భక్తి శ్రద్ధలలో ఎలాంటి మార్పులేదు. పిమ్మట పాండిచెరి మేత్రాసనంలోని అనేక గ్రామాల్లోని దేవాలయాలకు వెళ్లి అక్కడి క్రైస్తవులలో వారి విశ్వాస పటిష్టతకు తన ప్రార్థన, పవిత్ర జీవితం ద్వారా మాతృక చూపారు.

క్రీ॥శ॥ 1933లో తమిళనాడులోని తంజావూరు జిల్లా కుంభకోణం మేత్రాసనంలోని వైకల్పిటి విచారణలోని 'మణత్తిడల్లో' అనే చిన్న గ్రామంలో ప్రత్యక్షమయ్యారు సాధువైన జోసఫ్ తంబీగారు. ఆ గ్రామంలో తన ప్రేషిత కార్యాన్ని ప్రారంభించారు. సత్యోపదేశ బోధనం, సామూహిక ప్రార్థనల నిర్వహణలతో పాటు వ్యాధిగ్రస్తులను కలసికొని పరామర్శించేవారు. వారికి ఏవో ఆయుర్వేద మందులిచ్చి ఏసునామమున ప్రార్థిస్తూ స్వస్థత చేకూర్చుతుండేవారు. వారి ప్రయత్నం వల్ల 'మణత్తిడల్లో' గ్రామంకు ఆధ్యాత్మిక సేవలు నిరంతరం అందించడానికి ఒక గురువును ఏర్పరచడం జరిగింది. 1935 సెప్టెంబరు 1వ తేదీన నూతనంగా వచ్చిన గురువు బాధ్యతలు తీసుకుని బలిపూజను అర్పించారు. బ్రదర్ జోసఫ్ తంబి గారి కృషిని కొనియాడుతూ విచారణ రికార్డుల్లో నమోదు చేశారు కూడ. విశ్వాసుల ఆనందానికి అవధుల్లేవు.

ఆ తరువాత క్రీ॥శ॥ 1936లో సాధు జోసఫ్ తంబి గారు అదే మేత్రాసనంలోని తొండమన్‌దురై విచారణలోని పచ్చమలై గిరిజన గ్రామం చేరుకున్నారు. క్రీస్తు ప్రేమవాక్యాన్ని విన్పించారు. వారి అర్ధనగ్న శరీరాలు వస్త్రం తొడిగి ఉంచుకోవాలని, సోదర ప్రేమతో జీవించాలని నేర్పించారు. కాని తంబీ గారి ప్రయాస

ఆ అనాగరికులలో అరణ్య రోదనే అయ్యింది. అటు పిమ్మట వారు ఆ ఊరు ఈ ఊరు తిరుగుతూ క్రీస్తు సువార్తను బోధిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టారు. నెల్లూరు జిల్లాలోని బిట్రగుంట ఊళ్లో కొంతకాలం ఉండి సువార్తా బోధగావించారు. అక్కడ రైల్వేశాఖలో పనిచేసే తమిళులకు బాగా పరిచయస్థుడై తమ మాతృకతో వారిని బాగా ఆకర్షించారు.

క్రీ॥శ॥ 1937 చివరికాలంలో సాధు జోసఫ్ తంబి గారు విజయవాడ మేత్రాసనంలో పెద్దావుటపల్లి విచారణలోని 5 మైళ్లదూరంలో ఉన్న 'కేసరిపల్లి' అనే గ్రామంలో కనిపించారు. అక్కడ పునీత పాదువా అంతోని గుడి ఆవరణంలో ఉంటూ ఏవో కొన్ని తెలుగు మాటలు నేర్చుకున్నాడు. క్రైస్తవుల ఇండ్లను సందర్శిస్తూ వచ్చీరాని మాటలు, సైగలతో క్రీస్తు ప్రభుని సందేశాల్ని తెలియజేశారు. వారి పారవశ్యపు ప్రార్థనలు, ధ్యానం పవిత్ర నడవడి ప్రజల్ని బాగా ఆకట్టుకున్నాయి. కేసరిపల్లి గుడిలో ప్రతి ఆదివారం దివ్యబలిపూజ ఉండేదికాదు. కాన బ్రదరుగారు ఆసక్తిరేకెత్తించి విశ్వాసుల్ని పదుల సంఖ్యలో పెద్దావుటపల్లి గుడికి 5 మైళ్లు కాలినడకనే తీసుకొనివచ్చి ఆదివార పూజలో పాల్గొన జేసేవారు. గ్రామస్తులతో కలిసి పొలం పనిచేయడం, నాటు వైద్యంతో రోగులను స్వస్థపరచేవారు. కుల మత వ్యత్యాసాలు లేకుండా అందరితో కలివిడిగా తిరిగేవారు. తమ గ్రామంలో కూడ ఉండి తమను అలరించవలసిందిగా అవుటపల్లి క్రైస్తవులు తంబీగారిని అడుగుతుండేవారు. ఆ విషయాల్ని పెద్దావుటపల్లి విచారణలో 40 సం॥లు సుదీర్ఘకాలం తమ గురుత్వ సేవలందించిన ఇలాలియా పి.మె.సభ క్రైస్తవ మిషనరీ అయిన ఫాదర్ జె.బి. కల్దరారోగారు తమ వ్రాతల్లో పేర్కొన్నారు.

ఆ తర్వాత బ్రదర్ జోసఫ్ తంబి గారి మకాం అవుటపల్లికి మారింది. పెద్దస్వామి ఫాదర్ కల్దరారోకాగా చిన్న స్వామి ఫాదర్ రాజీ ఉండేవారు. వారి ఆశీస్సులతో తంబి గారు గుడి ప్రక్కనే గల ఒక పాకలాంటి మట్టిగోడల ఇంటిలో ఉండేవాడు. అవుటపల్లి గ్రామంలో బోయపాటి బసవయ్య సీతారామణమ్మగారి కుటుంబంలో ఉంది. వారు అగ్రవర్ణం వారు శ్రీమంతులుకూడాను. వారి ఆహ్వానంపై వారి ఇంటికి వెళ్లి కాలు విరిగి అమిత బాధతో దు:ఖిస్తున్న వారి బంధువురాలిని దర్శించారు. వారి కోరికపై ఆయమ్మ కాలుపై సిలువ గుర్తు వేయగానే ఎంతో ఉపశమనం పొంది ఆమె తంబి గారిని ప్రశంసించింది. మరికొద్ది దినాలకు కాలినొప్పి తగ్గిపోయి పూర్తి స్వస్థత చేకూరింది. వారి కృతజ్ఞతా ప్రదర్శనకు కొదవలేదు. ఈ అద్భుతం నోటి మాట ద్వారా బహుళ ప్రచారమైంది.

ఆ ఉన్నత కుటుంబం వారికి నలుగురు ఆడపిల్లలే కావడంతో మగసంతానం కావాలని బ్రదర్ తంబి గారికి తమ కోరిక విన్నవించుకోగా వారిని ముందుగా జ్ఞానస్నానం తీసుకొని క్రీస్తు ప్రేమ ఫలాల్లో భాగస్తులుకండి. అప్పుడు వారికి తప్పక మగ సంతానం కలుగుతుందని ప్రవచనం చెప్పారు. అలాగే వారు సమాజానికి భయపడి అర్ధరాత్రి క్రీ॥శ॥ 1939 జూలై 22న బప్తీసం తీసుకున్నారు. వారి జ్ఞానతండ్రిగా సాధుజోసఫ్ తంబి గారే నిలవడం విశేషం. వారికి ఫ్రాన్సీస్ అస్సిసిగారి సభల్లో ముఖ్యులైన ఫ్రాన్సీస్, క్లారమ్మ అనుపేర్లు నూతనంగా ఇవ్వబడ్డాయి. ప్రవచనం నెరవేరి దైవ కృపవల్ల ఆ దంపతులకు క్రీ॥శ॥ 1940 మే 6వ తేదీన మగ సంతానం కలిగింది. బాలస్వామి అని జ్ఞానస్నానం ఇప్పించుకున్నారు. తంబి గారి ప్రార్థనలవల్ల ఎలాంటి సాంఘిక సమస్యలు తలెత్తలేదు. పైగా క్రీ॥శ॥ 1939 మరియు 1940ల్లో చాలా మంది ఉన్నత కులాల కుటుంబాలు క్రీస్తు విశ్వాసంలో ప్రవేశించారు. బోయబాటి బాలస్వామి తమ నలుగురు పిల్లలతో ప్రభు కృపావరాలతో తమ ప్రభుసాక్షం విన్పిస్తూనే ఉన్నారు. పరలోక రాజ్యం చేర ప్రజలందరూ ప్రభు యేసు విశ్వాసుల కదలికి ఆహ్వానిస్తున్నారు.

**(తరువాయి భాగం వచ్చే సంచికలో)**

# శుభవచనం బైబిల్ క్విజ్

**పరమ గీతము 1 - 8 అధ్యాయాలు**

పేరు ............................ఇంటి పేరు........................విచారణ .............................

**I. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి** ఫోన్ నెంబర్.................................

1) నా ప్రియుడు నన్ను చల్లని చూపున చూడగా నాకు ............................ .......................సిద్ధించెను.

2) అతని.................................................................. మహా మధురముగా ఉండును.

3) అది......................................................స్వయముగా తయారు చేయించుకొనిన పల్లకి.

4) మన ఇంటి...................................................................దేవదారు కలపతో చేసిరి.

5) నీవు నా...............................................................................తిరిగిరమ్ము.

6) నా....................................................................ఆనందముతో పొంగిపోయినది.

7) నీ గళము..................................................................గోపురమువలె నున్నది.

8) నేనును నీ ...........................................................................వినగోరెదను.

9) నీ యందు...............................................................................మేమియు లేదు.

10) అచట ...............................................................................కోయును.

11) నేను నీకు నా ......................................................................కానుక పెట్టెదను.

12) నీ కంఠము గుండ్రముగా కట్టిన....................................................బురుజువలె ఉన్నది.

13) నీ ..................................................సుందరమైనది.

14) నీ ప్రేమను మధువు కంటె................................దానినిగా నెంచి......................................

15) నీ శిరస్సు.....................................................................వలె ఉన్నతముగా నిల్చియున్నది.

16) జలములు...............................................................................నార్పలేవు.

17) అతని తల.............................................................................వలె నుండును.

18) నేను ......................................పూచిన గులాబీని. కొండకోనలో వికసించిన........................

19) యువతులెల్లరును ఆమెను చూచి...............................................స్తుతించిరి.

20) నా.............................................................పిలుపు విన్పించుచున్నది.

21) నేను నిద్రించుచున్నానే గాని...........................................మేల్కొని యున్నది.

22) అచట నీవు నాకు................................................చేసియుండిడె వాడవు.

23) ఇస్రాయేలీయులలో శ్రేష్ఠులైన............................................అరువది మంది అతనికి అంగ
.........................................నుండి బరాబరులు చేయుచున్నారు.

24. ద్రాక్ష పూత బట్టి..................................................................గుబాళించుచున్నది.


25) రాణులు.............................................................మంది ఉండవచ్చును.

**శుభవచనం బైబిల్ క్విజ్ జవాబు పత్రాన్ని విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలో గానీ ఏప్రిల్ నెల 5వ తేదీలోపు మాకు పంపించాలి.**

**వచ్చే నెల పాఠ్యాంశం: సొలోమోను జ్ఞాన గ్రంథము 1-9 అధ్యాయాలు**

# ఇంద్రధనుస్సు

"నేను నీకు పరలోక రాజ్యపు తాళపు చెవులను ఇచ్చెదను. భూలోక మందు నీవు దేనిని బంధింతువో, అది పరలోక మందును బంధింపబడును. భూలోక మందు నీవు దేనిని విప్పుదువో, అది పరలోక మందును విప్పబడును" యేసు ప్రభు చెప్పిన ధనికుడు-లాజరు (లూకా 16,19-31) ఉపమానమును తెలిపే ఈ చిత్రాన్ని రంగులమయం చేద్దాం.



**పేరు:..................................వయస్సు........తరగతి........స్థలం................**

<u>సూచన :</u>

1. కేవలం 15 సం॥ల లోపు పిల్లలే ఈ పోటీలో పాల్గొనాలి.
2. రంగులు నింపిన చిత్రాన్ని మీ విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలోగానీ ఏప్రిల్ నెల 5వ తేదీలోపు మాకు పంపించాలి.



# "పిల్లలూ! యేసయ్య మిమ్ములను పిలుస్తున్నాడు"

**ప్రియమైన చిన్ని బిడ్డలారా!**

మనము తపస్సు కాలంలో అడుగు పెట్టి ఉన్నాము. తల్లి తిరుసభ మనలను 50 రోజులు ఉపవాసం, ప్రార్ధన మరియు ధానధర్మాలతో జీవించడానికి అహ్వానిస్తుంది. ఈ తపస్సు కాలములో మనము మంచి కార్యాలతో, సుకృత పుణ్యాలతో మరియు యేసయ్య చిందించిన రక్తంతో పాప ప్రక్షాళనం చేసుకొని ఉత్థాన పండుగకు సిద్ధం కావాలి. దేవునికి ప్రీతి కలిగించే ఉపవాసం ఏమిటో మీకు తెలుసా?

యెషయా 58,6-8లో మనము ఇట్లు చదువుతున్నాము, "నేను ఇష్టపడు ఉపవాసమిది. మీరు అన్యాయపు బంధములను విప్పుడు. ఇతరుల మెడ మీదకెత్తిన కాడిని తొలగింపుడు. పీడితులను విడిపింపుడు వారి నెత్తి బాధలకు గురిచేయకుడు. మీ భోజనము ఆకలిగొనిన వారికి వడ్డింపుడు. ఇల్లు వాకిలి లేని వారికి ఆశ్రయమిండు. బట్టలులేని వారికి దుస్తులిండు. మీ బంధువులకు సహాయము నిరాకరింపకుడు. అప్పుడు నా కృప ప్రాత:కాల సూర్యుని వలె మీపై ప్రకాశించును".

ఇతరులకు సహాయం చెయ్యాలి. మన ఖర్చు తగ్గించుకొని మనలాంటి చిన్న పిల్లల అవసరాలు తీర్చాలి. ఇతరులను బాధపెట్టే మాటల నుండి, చేష్టల నుండి మనల్ని దూరంగా ఉంచాలి. మనకి ఇష్టమైన ఆహార పదార్థాలను లేని వారితో పంచుకోవాలి. దుస్తులు లేని పిల్లలకు సహాయం చేయాలి. అప్పుడే మనం సూర్యుని ఉదయకాల కాంతిలాగా ఆనందాన్ని ఉత్సాహాన్ని ఉల్లాసాన్నిచ్చే యేసయ్య జ్యోతులలాగా ఈ లోకంలో వెలుగుతాము. మనం ప్రతిరోజు దివ్య పూజాబలిలో పాల్గొని యేసు ప్రభుని సిలువ మరణములు ధ్యానిస్తూ ఆయన దీవెనలు పొందుదాం.

**"యేసయ్య పరిశుద్ధ రక్తమా నన్ను శుద్ధీకరించు. యేసయ్య నీ ఆత్మతో నన్ను అభిషేకించు. అని రోజుకు ఒక 50 సార్లు ప్రేమతో భక్తితో ప్రార్థిద్దాం".**



# సహవాసం

**యేసు ఆత్మయందు వారి ఆలోచనలను గ్రహించి వారితో "మీ హృదయములలో ఇట్లేల తలంచుచున్నారు?" అని ప్రశ్నించెను (మార్కు 2,8).**

ఒక చెట్టు మీద రెండు రామచిలుకలు చక్కగా గూడు కట్టుకుని తమ పిల్లలతో సంతోషంగా కాలం గడుపుతున్నాయి. ఒక నాడు పొద్దున్నే అమ్మ చిలుక, నాన్న చిలుక ఆహారం కోసం చూస్తూ బయటికి వెళ్లాయి. ఇంతలో ఒక బోయవాడు పిల్ల చిలుకలని దొంగలించాడు. అందులో ఒక రామచిలుక వాడి నుంచి ఎలాగో తప్పించుకుని, ఒక ఆశ్రమంలోని చెట్టుపై నుంటూ, అక్కడ ఋషులు బోధిస్తున్న మంచి మాటలు వింటూ పెరిగింది. ఇంకొక రామచిలుకని బోయవాడు ఒక పంజరంలో బంధించి ఉంచుకున్నాడు. అది వాడి ఇంటి లోగిలో పెరిగింది. అది ఎంతసేపు తిట్లు, చెడ్డ మాటలు వింటూ అదే నేర్చుకుంది.

ఒకనాడు ఒక బాటసారి బోయవాడి ఇంటి దగ్గరలో ఉన్న చెట్టు క్రింద పడుకున్నాడు. అది చూసి చిలుక, "ఒరేయ్ మూర్ఖుడా" అంటూ భయపెట్టింది. వాడు గతిలేక అక్కడి నుండి వెళ్ళిపోయాడు. ప్రయాణించి, ఆ బాటసారి ఒక ఆశ్రమం చేరుకున్నాడు. అక్కడున్న రామచిలుక "స్వాగతం బాటసారి, నీ అలసట తీరేవరకు ఇక్కడ విశ్రమించవచ్చు" అంటూ తియ్యగా పలికింది. ఆ చిలుక మాటలు విని బాటసారి ఆశ్చర్యపోతూ, నీలాంటి రామచిలుకని నేను దారిలో కలిసాను. కానీ అది మహాకఠినంగా మాట్లాడుతోంది అన్నాడు. అప్పుడు చిలుక, బహుశా అది నా అన్న చిలుక అయ్యి ఉంటుంది. నేను సాధువులతో సాంగత్యం చేశాను కనుక, నా భాష ఇలా ఉంది. అదే నా అన్న వేటగాడి భాష నేర్చుకుని అలా మాట్లాడుతున్నాడు. మనం ఎలాంటి సాంగత్యంలో ఉంటామో అలాగే తయారవుతాము. అని రామచిలుక అనుకుంది.

మనం ఇప్పుడు చదివిన కథను చాలా సార్లు వినే ఉంటాం. మార్కు సువార్త 2వ అధ్యాయంలో పక్షవాత రోగి స్వస్థతను చూస్తూ ఉన్నాం. యేసు నాథుడు అచట నీ పాపములు క్షమించబడినవి అని పక్షవాత రోగితో పలుకుటను అక్కడ ఉన్న ధర్మశాస్త్ర బోధకులు చూసి పాపములు క్షమించుటకు ఈయన ఎవరు అని వారిలో వారు తర్కించుకొనుట గ్రహించిన యేసు నాథుడు మీరెలా ఇట్లు తలంచుచున్నారు అని ప్రశ్నిస్తున్నారు (మార్కు 2,8).

ఇప్పుడున్న సమాజంలో మనం అన్ని చెడులను చూడటం, మాట్లడటం చేస్తూ ఉన్నాం. కానీ, మనం మంచిని చూడటం, మాట్లాడటం మరచిపోతున్నాము. రామచిలుక కథలో అవి పెరిగిన ప్రదేశంలోని పరిస్థితులను బట్టి వాటి మాటలు మనం విన్నాం. యేసు నాథుడు పక్షవాత రోగిని స్వస్థపరచి, పాపములు క్షమించినప్పుడు ధర్మశాస్త్ర బోధకులు సందేహించడం గమనిస్తున్నాం. మనం అలా సందేహించడం, చెడు ఆలోచనలు మాని మంచి ఆలోచనలతో ఉందాం.

జె. ప్రశాంత్

## ధ్యాన కేంద్ర నిర్మాణము కొరకు ప్రార్థన

ప్రభువా, నీ నామ మహిమ కొరకు మరియు ఆదిలాబాద్ గురుపీఠంలో సువార్త వ్యాప్తి కొరకు మేము నిర్మించబడుతున్న ధ్యానకేంద్రాన్ని ఆశీర్వదించండి. ఎటువంటి ఆటంకములు లేకుండా దానిని సకాలంలో పూర్తి చేయుటకు తద్వారా మీ సువార్తను ప్రకటించుటకు మాకు అనుగ్రహం దయచేయమని ప్రార్థించుచున్నాము. ఆమెన్.

## మేత్రాసన స్థాయిలో పరిశుద్ధ సిలువ మార్గం

మార్చి 19,2021 శుక్రవారం నాడు బొక్కలగుట్ట పుణ్యక్షేత్ర కొండపై మేత్రాసన స్థాయిలో పరిశుద్ధ సిలువ మార్గం నిర్వహించబడుతుంది.

**సాయంత్రం 4.30 గంటలకు పరిశుద్ధ సిలువ మార్గం**

**అనంతరం ప్రిన్స్ అంతోని తండ్రి గారిచే వాక్య పరిచర్య**

**సిలువతో ఆశీర్వాదం**

**సిలువను ముద్దాడుట**

మనమందరం ఈ సిలువ మార్గంలో పాల్గొని క్రీస్తు మరణాన్ని ప్రకటించుదాం. మీతో పాటు ఇతరులను కూడా బొక్కలగుట్ట కొండపై జరుగు సిలువ మార్గంలో పాల్గొన వలసినదిగా ప్రోత్సహించండి. బొక్కలగుట్టలోని ఈ స్థలాన్ని పవిత్ర పుణ్యక్షేత్రంగా మార్చడానికి మనమందరం కృషి చేద్దాం.

# బైబిల్ దృశ్యమాలిక


జోసఫ్ చాలా సంతోషం. నీ దేవుడు నన్ను దీవించాడు.
దేవుడు దయామయుడు ఆయన అందరిని కాపాడి మేలు చేస్తాడు.
!
రేపు నీకు ధాన్యాగారం చూసే పని ఇస్తాను.
ఒక సంవత్సరం తరువాత
యజమానీ! ధాన్యాగారం నిండింది. వచ్చే ఏడాది ధాన్యం ఎక్కడ నిలువ ఉంచాలి.
నీవు ఏమనుకుంటున్నావు?
ఈ ధాన్యం అమ్మివేసి, దగ్గర ఉన్న పొలం కొందాం.
నీ యిష్ట ప్రకారమే చెయ్యి
జోసఫ్ ఎంత అందంగా ఉన్నాడు


కొన్ని సంవత్సరాలు గడిచాయి. దేవుని దీవెన వల్ల జోసఫ్ అన్నిటిలోనూ గొప్ప వాడయ్యాడు
జోసఫ్ నా ఇంటి పనులు కూడా నీవే చూడు
మీ ఇష్ట ప్రకారమే యజమానీ!
!!
పోతిఫర్ భార్య ఒక రోజు
జోసఫ్ మాట ఉంది ఇలా రా!
ఓఫిర్ వర్తకులకు ఉత్తరం రాస్తున్నాను. వస్తాను ఉండండి.
రా! లోపలికి రా జోసఫ్
!
ఆగిపోయా వేం! రా!
ఎందుకు పిలిచారు?

# శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు

## ఉపదేశకుడు 1-12 అధ్యాయాలు

1) విజ్ఞానము, విద్య (2,26)
2) బుద్ధిహీనతతో (10,13)
3) సోదరులుగాని, తనయులుగాని (4,8)
4) శ్రమలతోను, దు:ఖముతోను (2,23)
5) రాజు (5,9) (ఈ ప్రశ్నకు అందరికి మార్కు ఇవ్వబడును)
6) గౌరవము (10,12)
7) మంచిపేరు, గిట్టిన రోజు (7,1)
8) నిష్ప్రయోజనము, లాభము (6,11)
9) మూర్ఖుడే (7,7)
10) ముఖస్తుతులు (7,5)
11) బుద్ధిమంతుని (10,12)
12) విజ్ఞానమెక్కువ (1,18)
13) జ్ఞానమే (9,16)
14) పుట్టుట, గిట్టుట, నాటుట (3,2)
15) నేరములు, సవ్యముగనే (8,12)
16) మంచివి, చెడ్డవి, రహస్యమైనవి (12,14)
17) వెండి (12,6)
18) లోకమున, కార్యములెల్ల (1,14)
19) ప్రేమించుటకు, ద్వేషించుటకు, యుద్ధమునకు (3,8)
20) చాలినంత (5,10)
21) సౌఖ్యము (2,1)
22) ప్రభుత్వము, అన్యాయము (5,8)
23) భయభక్తులు (7,18)
24) పుస్తక (12,12)
25) వెలుతురు, సూర్యుని (11,7)

**వచ్చే నెల పాఠ్యాంశం: సొలోమోను జ్ఞాన గ్రంథము 1-9 అధ్యాయాలు**

# శుభాకాంక్షలు అందించండి



**జన్మదినం, వివాహము, వివాహ వార్షికోత్సవ, విచారణ పండుగలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేయాలనుకునేవారికి ఇదొక సదావకాశం. మీరు మీ ఫోటోను, ప్రచురించవలసిన వార్తను పంపించినట్లయితే మేము మీ తరుపున ఈ మాసపత్రికలో శుభాకాంక్షలు ప్రచురిస్తాము.**

బ్లాక్ & వైట్ ఫుల్ పేజీ రూ. 1000/–

బ్లాక్ & వైట్ ఆఫ్ పేజీ రూ. 500/–

బ్లాక్ & వైట్ క్వాటర్ పేజీ రూ. 250/–

ఈ సదావకాశమును వినియోగించుకొని మీ కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

**వివరాలకు సంప్రదించండి**

9440874028

**రచయితలారా, గమనించండి ! వెంటనే రచనలు పంపండి!**

ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చే రచనలు, కథానికలు, కవితలు, పిల్లల కథలు, మన విశ్వాసం గురించిన వివిధ అంశాలపై సామాజిక స్ఫూర్తినిచ్చే రచనలు వెంటనే పంపండి. **మీ రచనలు ప్రతినెల 12వ తేదిలోగా చేరాలి.** అలస్యంగా వచ్చే రచనలు పరిశీలింపబడవు.

**వివరాలకు సంప్రదించండి**

9398764408

**ఈ పత్రికను పొందాలనుకునే వారు మీ వివరాలు, అడ్రస్ మాకు పంపించండి**

**వార్షిక చందా 120 రూ॥లు**

**మా అడ్రస్**

**జీవస్వరం**

బిషప్స్ హౌస్, మంచిర్యాల – 504 208

మంచిర్యాల జిల్లా, తెలంగాణ

Cell : 9398764408, e-mail : jeevaswaramadilabad@gmail.com